సాక్షి అనకాపల్లి

సోమవారం : 8 : జనవరి : 2024



సాక్షి స్పెల్ బీకు స్పందన

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ పరీక్షకు విశేష స్పందన లభించింది.

8లో




అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు

ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వేడుకగా జరిగాయి.

8లో

సిరులతల్లికి విశేష పూజలు

మార్గశిర మాసోత్స వాల్లో భాగంగా ఆదివారం కనకమ హాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.



8లో

న్యూస్‌రీల్

గరుడ వాహనంపై గోవిందుడు



ఉపమాకలో గరుడ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ

నక్కపల్లి : ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారికి గరుడ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిగింది. నిత్యార్చనలు పూర్తి చేసి, కొండదిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, గోదాదేవి అమ్మవారికి, స్వామివారి ఉత్సవమూర్తులకు నిత్యార్చనలు నిర్వహించారు. శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారిని గరుడ వాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవ నిర్వహించారు. తిరుప్పావైలోని మారిముల్లై ములంగిన్ మున్నిక్కి డన్దు రంగుమ్ 23వ పాశురాన్ని విన్నపం చేశారు.

బుద్ధుడి జీవితంపై కాపారపు పరిశోధనలు



నాగేశ్వరరావుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

నక్కపల్లి: చందనాడ గ్రామానికి చెందిన డిగ్రీ అధ్యాపకుడు కాపారాపు నాగేశ్వరరావు బుద్ధుడి జీవితంపై పరిశోధనలు నిర్వహించారు. ఈ నెల 6, 7 తేదీల్లో విశాఖ బుల్లయ్య కళాశాలలో నిర్వహించిన హిస్టరీ కాంగ్రెస్‌లో ఈ పరిశోధనల గురించి వివరించారు. బుద్ధుడి జీవిత చరిత్రతో పాటు, అమరావతి, నాగార్జున కొండ, బొజ్జన్న కొండ బౌద్ధారామాల గురించి చేసిన పరిశోధనలను ఈ హిస్టరీ కాంగ్రెస్‌లో వివరించి నివేదిక సమర్పించినట్టు నాగేశ్వరరావు తెలిపారు. ఈ పరిశోధనల నివేదికపై నిర్వాహకులు నాగేశ్వరరావుకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నాగేశ్వరరావు చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

18మంది వలంటీర్ల నియామకం

అనకాపల్లి: జోన్ పరిధిలో 18 మంది వలంటీర్లను నియమించి, వారికి నియామక పత్రాలను అందజేసినట్టు జీవీఎంసీ ఏపీడీ డి.కె.దొర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మరో రెండు పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళికా విభాగం, మొక్కల విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలను నగర ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు.

వీసీసీ కప్ గోల్ఫ్ విజేత రాజు

విశాఖ స్పోర్ట్స్ : వైజాగ్‌పట్నం చాంబర్ కామర్స్ గోల్ఫ్ కప్ ఓవరాల్ విన్నర్‌గా వి.వి.జి.ఎస్.రాజు నిలిచారు. ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్‌క్లబ్‌లో ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో పలు డివిజన్లలో గోల్ఫర్లు పోటీ పడ్డారు. గోల్డ్ డివిజన్‌లో అశోక్ దయాల్ విజేతగా నిలవగా రామ్‌దొర రన్నరప్‌గా నిలిచారు. సిల్వర్ డివిజన్‌లో అమర్‌కాంత్ విజేతగా టిఎస్‌వర్మ రన్నరప్‌గా నిలిచారు. బ్రాంజ్ డివిజన్ విజేతగా కెసిఎస్ రావు, రన్నరప్‌గా పరేంద్రకుమార్ నిలిచారు. మహిళల విభాగంలో ఎం.సరిత విజేతగా.. ఆహ్వానితుల్లో విన్నర్‌గా అతుల్‌సింగ్ నిలిచారు. విజేతలకు తూర్పు నావికా దళ చీఫ్ కమాండర్ వైస్ అడ్మిరల్ జి.శ్రీనివాసన్ జ్ఞాపికలు అందించారు.

సురక్ష .. పేదలకు ఆరోగ్య రక్ష

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు పేదలకు వరంగా మారాయి. ఒకప్పుడు పడుతూలేస్తూ మైళ్లకొద్దీ ప్రయాణిస్తేగాని అందని వైద్యం సేవలు ఇప్పుడు ఇంటి ముంగిటకే అందుబాటులోకి వచ్చాయి. ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా ఈ యజ్ఞం సాగుతోంది. ఒక్క వైపు ఫ్యామిలీ డాక్టర్, మరో వైపు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలతో ప్రజలకు వైద్యం మరింత చేరువైంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు సైతం ఇప్పుడు కోలుకుంటున్నారు.

- మొదటి విడతలో జిల్లా వ్యాప్తంగా 80 వేల మందికి పరీక్షలు
- రెండో విడతలో కొనసాగుతున్న శిబిరాలు
- జిల్లాలో రోజుకు 24 శిబిరాల ద్వారా వైద్య సేవలు



శిబిరంలో నమోదు చేసుకుంటున్న రోగులు



బీపీ పరీక్ష చేయించుకుంటున్న మహిళ



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇస్తోంది. ఒకప్పుడు వైద్యం చేయించుకోవాలంటే డబ్బుల గురించి భయపడే వారందరికీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే గ్రామ గ్రామాన ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు గుర్తిస్తూ వైద్యసేవలందిస్తున్నారు. తాజాగా రెండో విడత నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో భాగంగా క్లిష్ట ఆరోగ్య సమస్యలున్న వారి ఆరోగ్యంపై వైద్య శాఖ ఆరా తీసి, చికిత్స అందిస్తోంది.

కోలుకున్న 4,500 మంది

- ఇప్పటి వరకు అందించిన వైద్య సేవల ద్వారా సుమారు 4,500 మంది కోలుకుంటున్నట్టు జిల్లా వైద్యఆరోగ్య శాఖ వెల్లడించింది.
- గత ఏడాది చివర్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత కార్యక్రమాలు జిలాల్లో సత్ఫలితాలిచ్చాయి.
- జిల్లాలోని అన్ని మండలాల్లో మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్షలో 80 వేలకు పైచిలుకు రోగులు ప్రాథమిక వైద్యాన్ని పొందారు.
- బీపీ,షుగర్ రోగులతో పాటు కీళ్లవాతం ఉన్న వారికి పూర్తిస్థాయిలో వైద్యం అందించారు. మొదటి స్టేజ్ కేన్సర్, కిడ్నీ సమస్యలు,టీబీ,కాలేయ సమస్యలున్న వారిని వైద్యులు గుర్తించి పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేశారు. రిఫర్ చేసిన ఆరు వేల మంది రోగుల్లో తాజాగా 4,500 మంది కోలుకుంటున్నారని వైద్య శాఖ తెలిపింది.
- పలువురు రోగులు కేజీహెచ్,అనకాపల్లి జిల్లా ఆస్పత్రుల్లో వైద్యం పొంది, మందులు వాడుతున్నారు.వీరిని రెండవ విడత నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షలో మళ్లీ గుర్తిసున్నారు.
- జిల్లా పరిధిలోని 24 మండలాల్లో ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరుగుతున్నాయి. మండలానికి వారంలో ఒక రోజు కేటాయించారు. జిల్లాలో రోజుకు 24 శిబిరాల ద్వారా సేవలందిస్తున్నారు. ప్రయాణ ఖర్చులు,మందుల ఖర్చులు, డాక్టర్ ఫీజు కట్టాల్సిన అవసరం లేకుండా జగనన్న మా ఇళ్ల వద్దే వైద్యాన్ని అందిస్తున్నారని గ్రామీణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సత్ఫలితాలిస్తున్న ఆరోగ్యసురక్ష



జిల్లాలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. తొలి విడతలో 80వేలకు పైగా ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు.రిఫర్‌చేసిన వారిలో 4,500 మంది కోలుకుంటున్నారు.ఇది మంచి పరిణామం.

– బాలాజీ, అదనపు డీఎంహెచ్‌వో

నీటిలో ఆటలు.. 'టూరిజం' కళ్లకు గంతలు!

- అనుమతులు లేకుండా ఐదేళ్లుగా వాటర్‌స్పోర్ట్స్
- రుషికొండలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి నిర్వాకం
- మామూళ్లు తీసుకొంటూ కన్నెత్తి చూడని టూరిజం శాఖ డివిజనల్ సిబ్బంది
- ఓ వాటర్ స్పోర్ట్స్ నిర్వాహకుడి అండతో నిర్వహణ
- ఆలస్యంగా గుర్తించిన పర్యాటక శాఖ అధికారులు
- క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు రంగం సిద్ధం
- టూరిజం సిబ్బందిని వెనకేసుకొచ్చేందుకు యత్నాలు

సాక్షి, విశాఖపట్నం : అనుమతులు లేవు.అయినా ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదేళ్లుగా పైగా సాగరతీరంలో స్పీడ్ బోట్లు నడిపించేశారు. స్కూబా డైవింగ్ చేయించేశారు. అయినా టూరిజం శాఖ అధికారులకు గానీ, సిబ్బందికి గానీ ఈ విషయం తెలీదంట. వాటర్ స్పోర్ట్స్ పేరుతో ప్రభుత్వానికి రూపాయి చెల్లించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి. ఇప్పటికే స్పీడ్ బోట్ల నిర్వహణ ఒప్పందాన్ని కుదుర్చుకున్న ఓ సంస్థ అండతోనే టూరిజం కళ్లుగప్పి నిర్వహించినట్లు తెలుస్తోంది. వాటర్‌స్పోర్ట్స్‌లో నడుస్తున్న దందా గురించి ఆలస్యంగా తెలుసుకున్న టూరిజం శాఖ ఉన్నతాధికారులు క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వాటర్ స్పోర్ట్స్‌కు కేంద్రబిందువుగా రుషికొండ తీరం మారింది. ప్రతిరోజూ వంద మందికి పైగా పర్యాటకులు స్పీడ్‌బోట్స్, స్కూబా డైవింగ్ చేస్తూ ఉంటారు. ఇక్కడ వీటి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం రెండు సంస్థలకు మాత్రమే అప్పగించింది. వీటితో పాటు టూరిజం శాఖకు చెందిన స్పీడ్ బోట్స్ కూడా ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తూ.. పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. అయితే ఐదేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి వాటర్ స్పోర్ట్స్ నిర్వహణ ప్రారంభించాడు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా స్పీడ్ బోట్స్, స్కూబాడైవింగ్ ఇలా ఇష్టం వచ్చినట్లు వాటర్ స్పోర్ట్స్ నిర్వహిస్తూ రూ.లక్షల్లో ఆర్జించాడు. కానీ పర్యాటక శాఖకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు.

తెలిసినా తెలియనట్లు..

ఈ గుర్తింపు లేని వాటర్‌స్పోర్ట్స్ వ్యవహారాన్ని ఏపీటీడీసీ డివిజనల్ స్థాయి అధికారులు, సిబ్బంది మూడేళ్ల క్రితమే గుర్తించారు. అయినా తమకేమీ తెలీదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దాదాపు దశాబ్ద కాలం క్రితం ఇక్కడ వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేందుకు ఒక సంస్థ పర్యాటక శాఖ నుంచి అనుమతులు తీసుకుంది. సదరు సంస్థకు చెందిన వ్యక్తి ద్వారా రుషికొండ బీచ్‌లోకి ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అనుమతిలేని వ్యక్తి ప్రవేశించినట్లు తెలుస్తోంది. చెల్లింపులు సైతం సదరు సంస్థకే అందజేస్తున్నారని వాటిలో కొంత భాగం డివిజనల్ కార్యాలయానికి చెందిన కొందరికి ముడుపులు ఇస్తున్నట్లు సమాచారం.

ఆలస్యంగా ఉన్నతాధికారుల దృష్టికి..

ఇటీవల పర్యాటక శాఖ ఉన్నతాధికారులు రుషికొండలో జరుగుతున్న వాటర్‌స్పోర్ట్స్ వ్యవహారాలపై సమీక్ష నిర్వహించారు. మరో సంస్థ స్కూబా డైవింగ్ నిర్వహించేందుకు అనుమతులు కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో ఇవన్నీ బయటపడ్డాయి. దీంతో సదరు యూపీకి చెందిన వ్యక్తిని టూరిజం ఉన్నతాధికారులు ప్రశ్నించగా ఇప్పుడెందుకు అడుగుతున్నారు.? ఎప్పటినుంచో ఉంది కదా అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న సంస్థపై కేసు పెట్టాలని డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అయితే ఇంత జరుగుతున్నా తెర వెనుక ఉండి ప్రోత్సహించి తమ లాభాలే తప్ప పర్యాటక శాఖకు రూపాయి కూడా రాకుండా వ్యవహరించిన టూరిజం శాఖ సిబ్బందిని మాత్రం వెనకేసుకొచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో వెటరన్ క్రీడాకారుల ప్రతిభ

వివిధ విభాగాల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కైవసం



అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన వెటరన్ క్రీడాకారులు దేముడు, త్రినాథ్, చినకన్నబాబు, గడి లక్ష్మి

దేవరాపల్లి: రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024లో దేవరాపల్లి మండలం కాశీపురానికి చెందిన నలుగురు వెటరన్ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. విశాఖపట్నం రైల్వే గ్రౌండ్‌లో నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 41వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో నెక్కెళ్ల దేముడు, దారపురెడ్డి త్రినాథ్, ఆదిరెడ్డి చినకన్నబాబు, గడి లక్ష్మి వివిధ విభాగాల్లో సత్తా చాటారు. నెక్కెళ్ల దేముడు 80 ఏళ్లకు పైబడిన విభాగంలో షాట్‌పుట్, 5 కిలోమీటర్ల వాకింగ్, 100 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. 70 ఏళ్ల వయసు పైబడిన విభాగంలో దారపురెడ్డి త్రినాథ్ 1500 మీటర్ల రన్నింగ్, 5 కిలోమీటర్ల వాకింగ్, హైజంప్‌లలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఆదిరెడ్డి చినకన్నబాబు 65 ఏళ్ల పైబడిన విభాగంలో షాట్‌పుట్, 100 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలోను, 5 కిలోమీటర్ల వాకింగ్‌లో ద్వితీయ స్థానంలోను నిలిచారు. గడి లక్ష్మి 50 ఏళ్ల పైబడిన విభాగంలో 400 మీటర్లు, 100 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలోను, 200 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి సత్తా చాటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రథమ స్థానంలో నిలిచిన వారికి గోల్డ్ మెడల్స్, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి సిల్వర్, తృతీయ స్థానంలో నిలిచిన వెటరన్ క్రీడాకారులకు బ్రాంజి మెడల్స్‌తో పాటు మెమొంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. స్టేట్ మీట్‌లో సత్తా చాటి మెడల్స్‌ను సొంతం చేసుకోవడం పట్ల పలువురు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కోటవురట్ల ఉపాధ్యాయుడి సత్తా



సిల్వర్ మెడల్ అందుకుంటున్న దేవిడ్

కోటవురట్ల: విశాఖ రైల్వే గ్రౌండ్స్‌లో రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో జరిగిన 41వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ –2024 పోటీల్లో కోటవురట్లకు చెందిన ఉపాధ్యాయుడు పి.డేవిడ్ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. 200 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్ మెడల్, హేమర్ త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించారు.ఈ పోటీల్లో పది జిల్లాల నుంచి 380 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నట్టు డేవిడ్ తెలిపారు. పతకాలు సాధించిన డేవిడ్‌కు సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వైభవంగా దేవానంద స్వామీజీ ఆరాధన మహోత్సవం



దేవానంద స్వామీజీని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



ఆరాధన మహోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు

- పీఠాధిపతుల ప్రవచనాలతో పులకించిన భక్తులు
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు

దేవరాపల్లి: సద్గురు దేవానంద సరస్వతీ మహారాజ్ (రుషీకేష్) 24వ ఆరాధన మహోత్సవాన్ని కొత్తపెంటలోని స్వామీజీ ఆశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి దేశ నలుమూలల నుంచి స్వామీజీ భక్తులు, శిష్యులు వేలాదిగా తరలి రావడంతో కొత్తపెంట గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తెల్లవారుజాము నుంచి సుప్రభాతం, పతాకావిష్కరణ, నరగ సంకీర్తన, భగవద్గీత పారాయణ తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పీఠాధిపతులు, స్వామీజీల ప్రవచనాలతో పులకించిన భక్తజనం

విశాఖ జిల్లా వడ్లపూడి ఆనందాశ్రమం పీఠాధిపతి రామకృష్ణానంద ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామి విష్ణుదేవానంద సరస్వతి అధ్యక్షతన జరిగిన ఆధ్యాత్మిక సభలో విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట స్వామి యోగానంద భారతి, హైదరాబాద్‌కు చెందిన ఆర్య సనాతన వేద ధర్మ ప్రచారకులు మాతా జ్యోతిశ్రీ , శ్రీను సిద్ధాంతి తదితర స్వామీజీల ఆధ్యాత్మిక ప్రవచనాలతో భక్తులు పులకించారు.

డిప్యూటీ సీఎం బూడి పూజలు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దేవానంద స్వామీజీని దర్శించుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను సభా వేదికపై ఆశ్రమ నిర్వాహకులు, స్వామీజీలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దేవానంద సరస్వతీ స్వామీజీ జన్మించిన కొత్తపెంట పుణ్యభూమిలో తానూ పుట్టడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. అనంతరం రామకృష్ణానంద రచించిన భీమిలి వైభవం పుస్తకాన్ని డిప్యూటీ సీఎం చేతులు మీదుగా ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, కొత్తపెంట సర్పంచ్ రొంగలి వెంకటరావు, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు తదితర ప్రజాప్రతినిధులు స్వామిజీని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవానంద స్వామీజీ ఆధ్యాత్మిక జీవన సంఘం అధ్యక్షుడు కర్రి దేముడు, కోశాధికారి లెక్కల గంగునాయుడు, కార్యదర్శి పి.ఎస్.కె. నరిసంగరావు, ఉపకోశాధికారి సీహెచ్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి



చేనేత కార్మికులకు పరికరాలను పంపిణీ చేస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు బాబూరావు, జోగులు



నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

పాయకరావుపేట: చేనేత రంగం అభివృద్ధికి, చేనేత కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అనకాపల్లి ఎంపీ బి.వి. సత్యవతి తెలిపారు. స్థానిక కార్మికుల సంఘం కార్యాలయంలో ఆదివారం చేనేత కార్మికులకు పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు (రాజాం ఎమ్మెల్యే) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్ఫూర్తి పథకం ద్వారా చేనేత రంగ క్లస్టర్ల అభివృద్ధికి ఆధునాతన పరికరాలు సరఫరా చేస్తుస్తున్నట్టు చెప్పారు. చేనేత వస్త్రాలను ఆధునాతన డిజైన్లతో తయారు చేస్తే కార్మికులకు గిట్టుబాటు ధర వస్తుందన్నారు. జిల్లాలో ఏటికొప్పాక బొమ్మలు తయారు చేసే కార్మికులు, చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేనేత రంగం అభివృద్ధికి, కార్మికులు సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రతి చేనేత కార్మికునికి సంవత్సరానికి రూ.24 వేల చొప్పున జమ చేస్తున్నట్టు చెప్పారు. 50 సంవత్సరాల వయసు గల చేనేత కార్మికులకు పింఛను సదుపాయం కల్పించినట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయ కర్త కంబాల జోగులు మాట్లాడుతూ నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో ఉన్న చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. సంఘం పరిధిలో గల ఫ్యాషన్ టెక్నాలజీ పాత భవనాన్ని సంఘానికి అప్పగించే విధంగా జిల్లా అధికారులతో మాట్లాడతామని తెలిపారు. అనంతరం నక్కపల్లి, పాయకరావుపేట చేనేత కార్మికులకు రాయితీపై కేంద్రం ప్రభుత్వం సరఫరా చేసిన పరికరాలను ఎంపీ , ఎమ్మెల్యేలు పంపిణీ చేశారు. 6 ఫ్రేమ్ మగ్గాలు(ఒక్కోటి రూ.32 వేలు), 40 సోలార్ లైట్స్(ఒక్కోటి రూ.15 వేలు), 21 మోటారైజ్ జాకార్డ్ పరికరాలు (ఒక్కోటి రూ.18వేలు) పంపిణీ చేశారు.ఒక్కోటి రూ.1.20 లక్షల విలువ గల 20 వర్క్ షెడ్లు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌ చార్జి దేవవరపు రాజేష్ ఖన్నా, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, చేనేత ఆర్‌డీఈ ధనుంజయ్, ఏడీ మురళీకృష్ణ, హెచ్‌టీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో అదనపు తరగతి గదులు

నక్కపల్లి: స్టీల్ అథారటరీ ఆఫ్ ఇండియా(సెయిల్) సీఎస్ఆర్ నిధులతో స్థానిక కేజీబీవీలో అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నట్లు అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతి తెలిపారు. కేజీవీబీలో రూ.35 లక్షలతో చేపట్టిన భవనాల నిర్మాణ పనులను ఆదివారం ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను కోరిన మేరకు నక్కపల్లి కేజీబీవీలో అసంపూర్తిగా నిలిచిపోయిన మూడు అదనపు తరగతి గదులను పూర్తిచేసేందుకు సెయిల్ అధికారులు అంగీకారం తెలిపి, రూ.35లక్షలు కేటాయించినట్టు తెలిపారు. ఇక్కడ పూర్తిస్థాయిలో బాలికల వసతి సమస్య తీరాలంటే మరో రూ.35లక్షలు అవసరమని, ఈవిషయాన్ని సెయిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అదనంగా నిధులు కేటాయించాలని కోరుతానని చెప్పారు. నాడు నేడు పథకం ద్వారా పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారిపోయాయన్నారు. ఈ పథకం రాష్ట్ర చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాందిపలికిందన్నారు. విద్య, వైద్యరంగాలకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లుఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపుకార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం , వైస్ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, ఎంఈవో కుంచం నరేష్, ప్రిన్సిపాల్ సలీమా, వైస్‌ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

రూ.2.20 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో ఆధునికీకరణ



రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులకోసం పొక్లెయిన్‌తో మట్టి తవ్వుతున్న సిబ్బంది

యలమంచిలి రూరల్: పట్టణంలోని రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ, ఆధునికీకరణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం మహానగరపాలక ప్రాంత అభివృద్ధి సంస్థ(వీఎంఆర్‌డీఏ) బృహత్తర ప్రణాళికలో భాగంగా రూ.2.20 కోట్లతో రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజు పట్టణంలో కీలకమైన రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులకు అవసరమైన నిధుల విడుదల కోసం కృషి చేసి సఫలీకృతులయ్యారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం ఈ రహదారి విస్తరణ పనులకోసం శంకుస్థాపన చేశారు. దీంతో కాంట్రాక్టు పొందిన శ్రీ లక్ష్మీ నిర్మాణ సంస్థ ఆదివారం పనులను ప్రారంభించింది. రహదారికిరువైపులా వెడల్పు చేయడానికి ఇంజినీర్లు ఇచ్చిన మార్కింగ్ ప్రకారం మట్టిని తవ్వుతున్నారు. 650 మీటర్ల పొడవు, రెండువైపులా కలిపి 14 మీటర్ల వెడల్పు ఉండేలా రోడ్డు విస్తరణ ఉంటుంది.మధ్యలో ఇనుప గ్రిల్స్‌తో డివైడర్ ఏర్పాటు చేస్తారు. యలమంచిలి మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు 15 ఏళ్ల క్రితం ఎమ్మెల్యే కన్నబాబు హయాంలో రైల్వేస్టేషన్ రోడ్డును విస్తరించారు. ఇపుడు మళ్లీ కన్నబాబు కృషితోనే ఈ రహదారి విస్తరణకు మోక్షం లభించడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిరులతల్లికి బంగారు నెక్లెస్ బహూకరణ



నెక్లెస్ అందజేస్తున్న తుమ్మిడి బ్రదర్స్ చైర్మన్ శ్రీనివాసరావు, అధినేత తుమ్మిడి రామ్‌కుమార్

దాబాగార్డెన్స్ : విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి రూ.లక్షా 16 వేల 750 విలువ చేసే 16 గ్రాముల 525 మిల్లీ గ్రాముల బంగారు నెక్లెస్‌ను ఆలయ ఈవో శిరీషకు తుమ్మిడి బ్రదర్స్ అధినేత తుమ్మిడి రామ్‌కుమార్, ప్రతినిధి శ్రీనివాస్ అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారిచే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. తుమ్మిడి బ్రదర్స్ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నెక్లెస్ అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె .తిరుమలేశ్వరరావు, తుమ్మిడి బ్రదర్స్ ప్రతినిధి బాబీ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

4200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం


బెల్లం పులుపును ధ్వంసం చేస్తున్న సీఐ గణేష్, ఎస్ఐ సుధాకర్, సిబ్బంది

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి సుబ్బారాయుడుపాలెం సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో టౌన్ సీఐ ఎన్.గణేష్, ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో ఆదివారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 4200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే వంట పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ, సారా విక్రయాలు జరిపిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్ర వాహనం

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మాడుగుల మండలం వీరనారాయణంకు చెందిన తలారి జగదీష్ బంగారుమెట్ట జంక్షన్ నుంచి వడ్డాది వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా జిల్లా పరిషత్ హైస్కూల్ మళ్లింపు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో జగదీష్ రోడ్డుపై పడిపోగా ఒంటిపైన, తలపైన తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం దెబ్బతింది. స్థానికులు జగదీష్‌ను చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అతని పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్ ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక


సమావేశానికి హాజరైన ఉద్యోగులు


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా పీఏసీఎస్ యూనియన్ అధ్యక్షుడిగా పి.నాగభూషణం ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక గాంధీనగరం అన్నపూర్ణ బ్యాంక్ ఆవరణలో యూనియన్ మహాజన సభ జరిగింది. ఈ సభలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్.శివరామకృష్ణ, కోశాధికారిగా ఓఎస్ ఈశ్వరరావుతోపాటు 14 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఏడాదిపాటు పని చేస్తుందని ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగభూషణం తెలిపారు. అనంతరం సమావేశంలో పీఏసీఎస్ సంఘాల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సత్యనారాయణ మాట్లాడారు. 1964 యాక్టు ప్రకారం ఉద్యోగుల జీతాలు సమానంగా చెల్లించాలన్నారు. ఏపీసీవోబీ, డీసీసీబీ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు జీతాలు పెంచుతున్నారని, సహకార రంగం ఉద్యోగులకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 8 వేల మంది ఉద్యోగులు, సన్న, చిన్నకారు రైతులకు సేవలందిస్తున్నారన్నారు. వ్యవసాయ రుణాలతోపాటు ఎరువులు క్రిమిసంహారక మందులు అందిస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ పీఏసీఎస్‌లో ఉద్యోగులు చాలీచాలని జీతాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 వేతన సవరణ నేటి వరకూ చేయలేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. ఉద్యోగులు వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి ఒమ్మి ఈశ్వరరావు, కన్వీనర్ లక్ష్మణరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సిరులతల్లికి విశేష పూజలు


ఉషానాయుడు డ్యాన్స్ అకాడమీ కళాకారుల కూచిపూడి నృత్యం

డాబాగార్డెన్స్(విశాఖ): మార్గశిర మాసోత్సవాల 25వ రోజు కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, సర్వదర్శనం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 ,500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం దేవులపల్లి శ్రీదేవిచే నిర్వహించిన అన్నమాచార్య కీర్తనలు, తిరువూరుకు చెందిన గోదా నరసింహారావుచే ఏర్పాటు చేసిన భక్తిరంజని, టి. ఉషానాయుడు డాన్స్ అకాడమీచే నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకున్నాయి.

11న మహాన్నదాన కార్యక్రమం..

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది కూడా చివరి గురువారం (ఈ నెల 11న) మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి టౌన్‌కొత్తరోడ్డు, జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్టు ఈవో కె. శిరీష తెలిపారు.

వైభవంగా అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

108 కలశాలతో గ్రామ పురవీధుల్లో భారీ ఊరేగింపు


కోలాట ప్రదర్శనను తిలకిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండలంలోని ఎం. అలమండలో అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపుతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ నినాదాలతో గ్రామమంతా మారుమోగింది. స్థానిక రామాలయ కమిటీ చైర్మన్ పోతల శంకరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ అక్షింతలు నింపిన 108 కలశాలతో పెద్ద ఎత్తున భక్తులు గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. మహిళల కోలాట బృందాల ప్రదర్శనలు, మేళతాళాల నడుమ ఊరేగింపుగా వెళ్లి, అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఇంటికీ అక్షింతలను పంపిణీ చేశారు. ఈ శోభాయాత్రలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. ముందుగా సీతారాములను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అయోధ్య రాముడి ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, సర్పంచ్ దాడి జగన్, మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బండారు ప్రసాదరావు, పాల సొసైటీ అధ్యక్షుడు పోలిపిరెడ్డి రమణ పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందర్శకుల సందడి


జలపాతం వద్ద సందర్శకుల తాకిడి

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నలుమూలలు నుంచి పెద్ద ఎత్తున వీరు తరలి రావడంతో ఈ ప్రాంతమంతా పండగ వాతావరణాన్ని తలపించింది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే జలపాతంలో జలకాటాలు ఆడేందుకు పోటీ పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సరదాగా గడిపారు. కొందరు ఇక్కడే వంటలు చేసుకుని సంహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం పచ్చని కొండల అందాలను తిలకించారు. మరోవైపు తాండవ ప్రాజెక్టు వద్ద సందర్శకుల తాకిడి కనిపించింది. ఇక్కడ ప్రాజక్టు దిగువన నల్లకొండమ్మ తల్లిని దర్శించుకుని పార్కులో సరదాగా గడిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో సబ్ రిజిస్ట్రార్ సత్తా


గోల్డ్ మెడల్ చూపుతున్న సబ్ రిజిస్ట్రార్

చోడవరం రూరల్: నాలుగు పదుల పైబడిన వయసు.. సబ్ రిజిస్ట్రార్‌గా రోజువారీ తీరిక లేని విధులు నిర్వహిస్తున్నా ఆమెలోని క్రీడాపటిమ వన్నె తరగ లేదు. అథ్లెటిక్స్‌లో సత్తా చాటి యువతకు స్ఫూర్తిదాయకం నిలిచారు. చోడవరం సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న బి.గీతాలక్ష్మి ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ 41వ చాంపియన్ షిప్-2024 పోటీల్లో పాల్గొన్నారు. ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వే గ్రౌండ్స్‌లో శని, ఆదివారాలలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆమె లాంగ్ జంప్‌లో ప్రథమ, 200 మీటర్ల పరుగు పోటీని 39.35 సెకన్లలో పూర్తి చేసి ద్వితీయ, డిస్కస్ త్రోలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈమె విజయం పట్ల చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, స్థానిక క్రీడా అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత


ఆస్పత్రిలో పింఛన్ ఇస్తున్న వలంటీరు

రావికమతం: విశాఖ గీతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గండిబోయిన చెల్లయ్యమ్మకు గ్రామ వలంటీర్ గంటా జయలక్ష్మి పింఛన్ సొమ్ము ఆదివారం అందజేసింది. రావికమతం మండలం మేడివాడకు చెందిన చెల్లయ్యమ్మకు ఆరోగ్యం బాగలేక పోవడంతో కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకుని వలంటీర్ అక్కడికి వెళ్లి పింఛన్ ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేసింది.

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వేడుకగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు రఘునాథ్ ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అదిష్టింపజేసి పూజ చేశారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జగన్ పాలన


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు

అనకాపల్లి: విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్టు ఎంపీ బి.వి. సత్యవతి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డు వద్ద మంత్రి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రూ.500 కోట్లతో ఈ విగ్రహాన్ని నిర్మించడం హర్షణీమన్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వారికి కూడా ఈ విగ్రహం కనబడుతుందని చెప్పారు. నేడు రాష్ట్రంలో అంబేడ్కర్ కలలుకన్న విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి వివిధ సామాజిక వర్గాల ప్రజలు ప్రారంభోత్సవానికి హాజరుకానున్నట్టు చెప్పారు. ఒక్కో సచివాలయ పరిధి నుంచి ఐదు సామాజిక వర్గాలకు చెందిన ఐదుగురు చొప్పున ఈనెల 18న విజయవాడ బయలుదేరుతున్నట్టు తెలిపారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జగన పాలన సాగుతుందన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆడారి స్వామి, జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బి.వెంకట సత్యవతి, జెడ్పీ కోఆప్షన్‌సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ(జోసెఫ్), పార్టీ వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, చోడవరం పార్టీ పరిశీలకుడు చిక్కాల వెంకటరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ పాల్గొన్నారు.

మద్యంతో పట్టుబడిన వ్యక్తి అరెస్టు

యలమంచిలి: అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కె.సావిునాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం యలమంచిలి మున్సిపాలిటీ సోమలింగపాలెం గ్రామానికి చెందిన పిల్లా రమణబాబు పరిమితికి మించి నాలుగు మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా యలమంచిలి పట్టణంలో ఆదివారం పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అక్రమంగా ఎవరైన మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వడ్డాది సంతకు పండగ కళ


వడ్డాది సంతలో దుస్తుల కొనుగోలు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది సంతలో ఆదివారం జోరుగా కొనుగోలు, అమ్మకాలు సాగాయి. అనకాపల్లి, విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు వడ్డాది ముఖ ద్వారం కావడంతో కిటకిటలాడింది. వారం రోజుల్లో సంక్రాంతి పండగ ఉండటంతో సందడి నెలకొంది. ముందుగానే కొత్త బట్టలు, పిండివంటల తయారీ వస్తువులు, నాటుకోళ్ల కొనుగోలు చేశారు. వడ్డాది ఆర్చి వద్ద నాటుకోళ్ల అమ్మకాలు సాగాయి. ఒక్కో నాటు కోడి రూ.వెయ్యి నుంచి నుంచి రూ.6 వేల వరకు ధర పలికింది. ఇంటికొచ్చే కొత్త అల్లుళ్లు, చుట్టాలకు పలు రకాల పిండి వంటలు వండిపెట్టేందుకు వంట సామగ్రి, పప్పుదినుసుల కొన్నారు. పితృదేవతలకు కొత్త బట్టలు పెట్టి ప్రత్యేక పూజలు చేయడానికి పలువురు చీరలు, పంచులు, తువ్వాలు, తదితర సామగ్రి కొనుగోలు చేశారు. ఇటీవల వర్షాలు కురవడంతో సాగుకు కూరగాయల విత్తనాలు, నారు అమ్మకాలు, కొనుగోళ్లు జోరుగా సాగాయి.

జిల్లా జూనియర్ హాకీ జట్టు ఎంపిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్నసీఐ షేక్ గఫూర్

యలమంచిలి రూరల్: పట్టణంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జిల్లా జూనియర్ హాకీ జట్టు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. యలమంచిలి హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక ప్రక్రియకు జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన హాకీ క్రీడాకారులు హాజరయ్యారు. వీరిని ముందుగా యలమంచిలి సీఐ షేక్ గఫూర్ పరిచయం చేసుకున్నారు. యలమంచిలి హాకీ క్రీడాకారులకు పుట్టినిల్లు అని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. క్రీడల వల్ల పోటీతత్వం, పట్టుదల, శారీరక దారుఢ్యం పెరుగుతాయన్నారు. శిక్షణలో ఏకాగ్రత చూపితే బాగా రాణించవచ్చని సూచించారు. అనంతరం ఎంపిక కోసం నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. మొత్తం 18 మందితో కూడిన తుది జట్టును ఎంపిక చేశారు. వీరంతా సోమవారం జిల్లా నుంచి తిరుపతికి బయలుదేరి వెళతారు. అక్కడ ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న ఆంధ్రప్రదేశ్ 14వ అంతర్ జిల్లాల జూనియర్ హాకీ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారు. అనకాపల్లి హాకీ సంఘ సభ్యులు ఆడారి వీరునాయుడు, ఏబీఎల్ రాజు, జీ రాంబాబు, ఎం రూపేష్, భవానీ, వాసు, ఎల్ ప్రసాద్ ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు.

సాక్షి స్పెల్ బీకు విశేష స్పందన

- విశాఖలో రీజినల్ స్థాయి పరీక్ష
- అధిక సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు

SAKSHI SPELL Bee 2023-24


స్పెల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య : 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆదివారం నగరంలోని అక్కయ్యపాలెంలో గల జ్ఞాననికేతన్ పాఠశాలలో జరిగిన పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను నాలుగు కేటగిరీలుగా విభజించి స్పెల్ బీ పరీక్ష నిర్వహించారు. పాఠశాల, జిల్లా స్థాయిలో ఇప్పటికే జరిగిన పరీక్షల్లో ప్రతిభ చాటిన విదార్థులు రీజినల్ స్థాయి పరీక్షలో పాల్గొన్నారు. వీటిలో సత్తా చాటిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పరీక్షకు హాజరుకానున్నారు. రవీంద్ర భారతి, శ్రీ చైతన్య, చలపతి, రవీస్ లిటిల్ ఛాంప్, గ్రీన్ సిటీ, శ్రీ విశ్వ, విశాఖ, నారాయణ దొర, వి.టి.స్కూల్, రామకృష్ణ తదితర పాఠశాలల నుంచి విద్యార్థుల పరీక్షకు హాజరయ్యారు. పోటీతత్వాన్ని పెంపొందించేలా నిర్వహిస్తున్న పరీక్ష కావటంతో విద్యార్థులు తల్లిదండ్రులు సైతం ఎంతో ఆసక్తి కనబరిచి, వారే స్వయంగా తమపిల్లలను పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సాక్షి మీడియా ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్ గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించాయి. విశాఖతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించారు. జ్ఞాననికేతన్ ఎయిడెడ్ స్కూల్ కరస్పాండెంట్ సునీత పరీక్షలను పర్యవేక్షించి, తగిన సహకారం అందించారు.

పిల్లలకు ఎంతో ఉపయోగం



మా అమ్మాయి లాస్య 8వ తరగతి చదువుతుంది. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్ష రాస్తానని చెబితే ప్రోత్సహించాం. ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

– కట్టా సునీత, విద్యార్థి తల్లి, విశాఖపట్నం

పోటీతత్వం పెరుగుతుంది



మా పెదబాబు 8, చిన్నోడు 5వ తరగతి చదువుతున్నాడు. ఇద్దరినీ కూడా సాక్షి మీడియా గ్రూప్ వారు నిర్వహించే స్పెల్ బీ పరీక్ష రాయిస్తున్నాను. పెదబాబు గతంలో కూడా రాష్ట్ర స్థాయి వరకు వెళ్లాడు. ఇలాంటి పరీక్షల వల్ల పిల్లల్లో పోటీ తత్వం పెరుగుతుంది.

– మజ్జి సుజాత, విద్యార్థి తల్లి, గాజువాక

పోటీ పరీక్షలంటే ఇష్టం



పోటీ పరీక్షలు రాయటం అంటే ఎంతో ఇష్టం. సాక్షి స్పెల్ బీ పరీక్ష ఇప్పటికే రెండు సార్లు రాశాను. ఫైనల్‌కు వరకు వెళ్లాలనే లక్ష్యంతో బాగా ప్రిపేర్ అయ్యాను. స్పెల్ బీ పరీక్ష రాసేందుకు మా టీచర్లు ప్రోత్సహించారు. అమ్మనాన్న ఇక్కడి వరకు తీసుకొచ్చారు.

– వి.భాను చక్రధర్, 5వ తరగతి, విజయనగరం

ఇంగ్లిష్ నేర్చుకోవచ్చు



స్పెల్ బీ పరీక్ష ఫైనల్‌కు వెళ్లాలని మా టీచర్లు అన్ని నేర్పించారు. దీని వల్ల ఇంగ్లిష్ బాగా నేర్చుకోవచ్చు. మా స్కూల్లో పెట్టే పరీక్షల్లో నేను పాల్గొంటాను. అమ్మ నాన్న బాగా ప్రోత్సహించారు. సాక్షి వారు ఇచ్చిన పుస్తకంతో పరీక్షకు సిద్ధమయ్యాను.

– మళ్ల చైత్ర గీతిక, 6వ,తరగతి, శ్రీకాకుళం

ఫైనల్‌కు వెళ్తాను



స్పెల్ బీ పరీక్షలపై మా స్కూల్లో టీచర్లు బాగా నేర్పించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పరీక్షలో విజయం సాధించాను. ఈసారి స్పెల్ బీ పరీక్ష బాగా రాశాను. ఫైనల్‌కు వెళ్తాననే నమ్మకం ఉంది.

– నీలపు ఇతియా, 6వ తరగతి, గాజువాక

స్కూబా డైవర్ల సేవలు స్ఫూర్తిదాయకం

కొమ్మాది: స్కూబా డైవర్ల సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. విశాఖను పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ఎకో వైజాగ్‌లో భాగంగా ఎకో క్లీన్, ఎకో బ్లూ, ఎకో-0 ప్లాస్టిక్ కార్యక్రమాల్లో భాగంగా ప్లాటీపస్ ఆర్గనైజేషన్ స్కూబా డైవర్లు రుషికొండ సముద్ర గర్భంలో వ్యర్థాలను వెలికితీసి అందరికీ ఆదర్శంగా నిలవడం అభినందనీయమన్నారు. రుషికొండ తీరంలో నోడల్ ఆఫీసర్, యూసీడీ ప్రాజెక్ట్ అధికారి డి.లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కశింకోట సీఐగా వినోద్‌బాబు


బాధ్యతలు స్వీకరిస్తున్న వినోద్‌బాబు

కశింకోట : కశింకోట సీఐగా వినోద్‌బాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారంతో చర్యలు చేపడతామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు అరికట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా కోడి పందాలు, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం ఇచ్చి ప్రజలు సహకరించాలని కోరారు.

చిన్నరామ భజన బృందం నగర సంకీర్తన


నగర సంకీర్తన చేస్తున్న శ్రీచిన్నరామ భజన బృందం

తుమ్మపాల : మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గవరపాలెం చిన్న రామస్వామి దేవాలయ భజన బృందం సభ్యులు ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. దేవాలయాల్లో భజనలు, పూజలు చేసి, స్వామి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం చిన్న బోయి గూడెంవీధి శ్రీ కోదండరామ లక్ష్మీ గణపతి ఆలయంలో ధనుర్మాస విందు భక్తులందరూ స్వీకరించారు. శ్రీ రంగనాథ గోదాదేవిల ఆశీస్సులు అందరికీ లభించాలన్నారు. ఈ కార్యక్రమంలో భజన బృందం సభ్యులు ఆళ్ల శ్రీను, బొడ్డేడ రాజు, వెంకటేష్, కర్రి రాము, పిల్ల రామప్పరావు, విల్లూరి సురేష్, విల్లూరి పరమేష్ పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ


సంక్రాంతి కానుక అందజేస్తున్న బత్తుల గణేష్

అనకాపల్లి : బడుగు, బలహీన వర్గాల ప్రజలు సంక్రాంతి పండగను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ బత్తుల గణపతి అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయంలో సుమారు 200 మంది నిరుపేదలకు బియ్యం, వస్త్రాలు, పప్పు దినుసులు, వంట నూనెతో పాటు 10 రకాల వస్తువులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క వ్యక్తికి సుమారు రూ.2 వేలు విలువ చేసే నిత్యావసర సరకులు ఇచ్చామన్నారు. అనంతరం చిన్నవీధిలో కల్యాణ మండపం నిర్మాణానికి రూ.కోటి నగదు ఇచ్చిన వ్యాపారవేత్త నుదిటి పాటి తాతాజీని అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కడిమిశెట్టి సతీష్, బిళ్లపాటి కృష్ణకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్	:	రాజా
కపాలదీవి	:	సత్యనారాయణస్క్రీన్-1
దీనమ్మ జీవితం	:	సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్	:	షిర్డిసాయి
సలార్	:	పర్తిసాయి
రాఘవరెడ్డి	:	వెంకటేశ్వర
తికమక తాండ	:	శ్రీసత్య
సలార్	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 43 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ' పాజిటివ్-3 యూనిట్లు, 'బి' పాజిటివ్-15 యూనిట్లు, 'ఒ' పాజిటివ్-20 యూనిట్లు, ''ఎబి' పాజిటివ్-5 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 262 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 228 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

జగనన్న ఇచ్చిన వాహనంపై అమ్మను మార్కెట్‌కు తీసుకెళ్తున్నాను..



నా పేరు పెట్ల సన్యాశిరావు. పట్టణంలోని గవరపాలెంలో ఉంటున్నాను. నేను 10వ తరగతి వరకు చదువుకున్నాను. మా నాన్న గారు ఉన్నంత వరకు నాకు ఆయన సహాయంగా ఉండేవారు. ఆయన మరణం తర్వాత నాకు సహాయం చేసేవారు లేక చాలా ఇబ్బంది పడ్డాను. ట్రైసైకిల్‌పై సుదూర ప్రాంతాలకు వెళ్లలేక నిరాశగా ఉండేది. జగనన్న ఇస్తున్న వాహనం కోసం దరఖాస్తు చేయడంతో నాక్కూడా ఉచితంగా వాహనం అందించారు. ఇప్పుడు ఉపాధి కోసం ఎక్కడికైనా సులభంగా వాహనంపై తిరుగుతున్నాను. ఉద్యోగం కోసం కలెక్టర్‌కు వినతి పత్రం అందించాను. ముందుగా శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ కల్పించి ఉపాధి కల్పిస్తామని దివ్యాంగ శాఖ అధికారులు హామీ ఇచ్చారు. గతంలో ప్రతిరోజూ తిరగలేక శిక్షణ పొందలేదు. ఇప్పుడు శిక్షణ తీసుకోవడానికి వాహనం ఉంది. నా పనులతో పాటు ఇంటిలో పనులు కూడా చేయగలుగుతున్నాను. మా అమ్మను కూడా మార్కెట్, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నాను.

సీఎం జగన్‌కు ధన్యవాదాలు..



నా పేరు బుగిడి నూక అప్పారావు. వికలాంగుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నాను. వాహనాలు నడపగలిగి కొనుక్కునే ఆర్థిక స్తోమత లేని అనేక మందికి సీఎం జగన్ అందించిన ఉచిత వాహనాలు కొండంత అండగా నిలిచాయి. జిల్లా కేంద్రంగా ఉన్న అనకాపల్లిలో ఏ పనికైనా ఈ వాహనాలపై మరొకరి సహాయం లేకుండా చేరుకోగలుగుతున్నాం. రూ. 1 లక్షకు పైగా విలువ గల వాహనాలు ఉచితంగా అందించడం చాలా ఆనందంగా ఉంది. వాహనాలు పొందిన కొందరు ఉపాధి నిమిత్తం పలు ప్రాంతాలకు సులభంగా చేరుకుంటున్నారు. సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.

దివ్యాంగులకు దిక్సూచి


సీఎం జగన్ అందజేసిన వాహనాలపై దివ్యాంగులు



అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. విద్య, వైద్యం అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం దివ్యాంగుల ఉన్నతికి కూడా విశేషంగా కృషి చేస్తోంది. అందులో భాగంగా దివ్యాంగుల కోసం త్రిచక్ర వాహనాలను ఉచితంగా అందిస్తూ.. వారు సొంతంగా కావలసిన చోటుకు వెళ్లి స్వయంగా పనులు చేసుకునేలా అవకాశం కల్పించింది.

- ఉచిత త్రిచక్ర వాహనాలు అందజేసిన సీఎం జగన్ సర్కార్
- మరొకరి సాయం లేకుండా ఎక్కడికైనా ప్రయాణం చేస్తున్నామని దివ్యాంగుల ఆనందం

తుమ్మపాల : రాష్ట్రంలో అన్ని వర్గాలను ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం జగన్ పని చేస్తున్నారు. ఇప్పటికే అనేక సంక్షమ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తు పేదల సంక్షేమానికి అత్యధికంగా ఖర్చు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఉన్న దివ్యాంగులకు కూడా సర్కారు ఉచితంగా త్రిచక్ర వాహనాలు అందించింది. విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్ సహకార సంస్థ (ఏపీడీఏఎస్సీఏసీ) మార్గదర్శకాల ప్రకారం ఇప్పటికే వాహనాల పంపిణీ, వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. 70 శాతం వైకల్యం కలిగిన వారికి ఉచితంగా వాహనాలను అందించడంతో దివ్యాంగులు హుషారుగా వాహనాలపై గమ్యాలకు తరలిపోతున్నారు.

అర్హులు వీరే.....

కనీసం పదో తరగతి పాసై వికలాంగత్వంపై సదరం సర్టిఫికెట్ కలిగి, 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు, రూ. 3 లక్షల లోపు వార్షిక ఆదాయం, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ ధ్రువ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, పూర్తి ఫొటోతో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం వాహనాలు అందించింది.

ఆర్టీవో అధికారుల సహకారం..

ప్రభుత్వం వాహనాలను ఉచితంగా అందించడంతో పాటు రిజిస్ట్రేషన్, సీబుక్, నేమ్ బోర్డులకు ఎటువంటి శ్రమ పడకుండా అధికారులే అన్నీ దగ్గరుండి చూసుకున్నారు. వాహనాల డ్రైవింగ్, రోడ్డుపై వాహనాలు నడపడంపై కూడా రవాణ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 5వ తేదీన 28 మంది దివ్యాంగుల వాహనాలకు ఉచితంగా సేవలందించారు. వాహనాలకు అవసరమయ్యే అన్ని ధ్రువీకరణ పత్రాలతో పాటు రోడ్డు నిబంధనలు, వాహనాల వేగం, జాగ్రత్తలు, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యల వంటి అంశాలపై సూచనలు చేశారు.

అర్హులకు వాహనాల మంజూరు..

నియోజకవర్గంలో జీవీఎంసీ పట్టణం, అనకాపల్లి, కశింకోట మండలాల్లో దాదాపు రెండు వేల మంది వరకు దివ్యాంగులు ఉన్నారు. వారిలో వాహనాలు డ్రైవింగ్ చేయగల వారు 150 నుంచి 200 మంది ఉన్నారు. వారికి ఇప్పటికే వాహనాలు ఉన్నాయి. ప్రభుత్వం అందించిన పథకంలో దాదాపు 50 వరకు దరఖాస్తులు రాగా వారిలో ఆయా రిజర్వేషన్ల జాబితా అనుసరించి 2023-24 ఏడాదికి గాను 10 మంది అర్హులను గుర్తించి వారికి వాహనాలు పంపిణీ చేశారు.

మర్యాదపూర్వక కలయిక


డిప్యూటీ సీఎం బూడిని మర్యాదపూర్వకంగా కలిసిన మలసాల భరత్‌కుమార్

కశింకోట : ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడును వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ ఎంపీపీ మలసాల కాసులమ్మ (ధనమ్మ), మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పలకా రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనకాపల్లి మండలం కొండుపాలెం గ్రామంలో సత్తెమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక నాయకులతో మమేకమయ్యారు. మామిడిపాలెం, తగరంపూడి, మండలంలోని తేగాడ, కశింకోట గ్రామాల్లో పలువురు నాయకులను కలిశారు.

14న ఉత్తమ సేవకులకు సత్కారం


కొణతాల లక్ష్మీపార్వతి

అనకాపల్లి : తెలంగాణ, ఏపీలో ఉత్తమ సేవలందించిన వ్యక్తులకు ఈనెల 14న స్థానిక ఉప్పల చంద్రశేఖర్‌రావు కల్యాణ మండపంలో స్వర్గీయ కొణతాల రామలింగ స్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో (సేవ, ఉపాధ్యాయ, విద్యార్థి రంగాల నుంచి ఆరుగురికి) పురస్కారాలు అందజేస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు కొణతాల లక్ష్మీపార్వతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తన భర్త కొణతాల రామలింగస్వామి స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో ఏడీఆర్‌గా విధులు నిర్వహించి విశ్రాంతి పొందిన తర్వాత మూడు సంవత్సరాల క్రితం స్వర్గస్తులైనట్లు ఆమె తెలిపారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ


క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి : గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు ప్రభుత్వం నిర్వహిస్తుందని నియోజకవర్గ సమన్వయ కర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కార్యాలయంలో ఆదివారం క్రికెట్ క్రీడాకారులకు కిట్లు అందజేశారు. క్రీడల ద్వారా ఆరోగ్యంగా జీవించమే కాకుండా శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. నిత్యం క్రీడలు ఆడితే వివిధ రకాలైన వ్యాధుల నుంచి విముక్తి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ఈనెల 10వ తేదీ నుంచి మండల స్థాయిలో ఆడుదాం..ఆంధ్రా పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ యుజవన విభాగం ఉపాధ్యక్షుడు వేగి త్రినాథ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైకుంఠ నారాయణస్వామి ధ్వజస్తంభం ప్రారంభం


శిలా ఫలకాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మళ్ల బెనర్జీ, నాగసత్య, గల్లా శ్రీనివాస్, కనకమహాలక్ష్మి దంపతులు


అర్చకులను సత్కరిస్తున్న అతిథులు

తుమ్మపాల : రాజుపాలెం శ్రీ సూర్యనారాయణ మూర్తి ఆలయం రెండు ధ్వజస్తంభాలతో ప్రత్యేకతను సంతరించుకుందని దేవస్థానం కమిటీ చైర్మన్ కొణతాల బాబూరావు అన్నారు. జీవీఎంసీ 80వ వార్డులో గల రాజుపాలెం శ్రీసూర్యనారాయణ మూర్తి ఆలయ ప్రాంగణంలో ఇటీవల నిర్మితమైన శ్రీవైకుంఠనారాయణస్వామి ఆలయానికి ఆదివారం ధ్వజస్తంభ సంప్రోక్షణ వేడుక జరిగింది. రూ.3 లక్షలతో నిర్మించిన ధ్వజస్తంభాన్ని దాతలు ప్రముఖ వైద్యులు డాక్టర్ బెనర్జీ, నాగసత్య, విశాఖకు చెందిన మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీనివాస్ కనకమహాలక్ష్మి దంపతులు ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో 12 ప్రముఖ దేవాలయాల అర్చక స్వాములకు ఎర్రంశెట్టి నాని సహకారంతో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అంతకు ముందు దాతలు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి బాబూరావు కృతజ్ఞతలు తెలిపి దాతలను కుటుంబ సమేతంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ కార్యదర్శి గొల్లవిల్లి రామకోటేశ్వరావు, కోశాధికారి గొల్లవిల్లి రామకృష్ణప్రసాద్, పర్యవేక్షణ కమిటీ సభ్యులు గొల్లవిల్లి నర్సింగరావు, బండారు రమణ, గొల్లవిల్లి చిరంజీవి, అధిక సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు తరలి వచ్చారు.

అలరించిన కామెడీ షో


కామెడీ షోలో నవ్వులు పూయిస్తున్న కళాకారులు

అనకాపల్లి : స్థానిక మెయిన్‌రోడ్డు వైఎంవీఏ హాల్లో లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అదుర్స్ కామెడీ షో, అనకాపల్లి కెవ్వుకేక, ఆనంద్ మ్యాజిక్, జోక్స్ వంటి కార్యక్రమాలు జరిగాయి. నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ పై కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు దాడి వాసు, కార్యదర్శి బొడ్డేడ మురళి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

గొలుగొండ: ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు అధిక లాభాలతోపాటు ఆరోగ్యకరమైన పంటలు పండివచ్చని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్తలు బండి నాగేంద్ర, వాన ప్రసాదరావు తెలిపారు. మండలంలో గింజర్తి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ఖర్చు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. చీడపీడలు సోకవని తెలిపారు. ప్రతీ గ్రామంలో వీటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి రైతు తప్పకుండా సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పెట్ల నారాయణమూర్తి, రాజశేఖర్, మల్లేస్ పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో పర్యటించనున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి : మండలంలో మార్టూరు, సీహెచ్ఎన్ అగ్రహారం, రేబాక, శంకరం గ్రామాల్లో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం ఉదయం 9 గంటలకు పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్య నేతలతో సమావేశం అవుతారని తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కూడా విచ్చేస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష ఆదరణ


సేవలందించిన సిబ్బందికి జ్ఞాపికలందజేస్తున్న అతిథులు

కశింకోట : స్థానిక సత్యానగర్ కాలనీలో మేము సైతం సమాజం కోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష ఆదరణ లభించింది. 34 మంది రక్తదానం చేశారు. విశాఖపట్నంలోని విజయ్‌శ్రీ బ్లడ్ బ్యాంకుకు రక్తాన్ని అందజేశారు. ఎక్కువ సంఖ్యలో యువకులు ఉత్సాహంగా శిబిరంలో పాల్గొన్నారు.

సీపీఎం నేత బాలకృష్ణకు సంతాపం

అనకాపల్లి : స్థానిక సీపీఎం సీనియర్ నేత అంగులూరి బాలకృష్ణ ఆదివారం తెల్లవారు జామున విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మూడు మాసాల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో విమ్స్‌లో చికిత్స పొందుతూ షుగర్, కిడ్నీ సమస్యలతో బాలకృష్ణ ఇబ్బంది పడ్డారు. తర్వాత ఆయన డిశ్చార్జి అయి ఇంటి వచ్చారు. మూడు రోజులు క్రితం మరో సారి బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో కేజీహెచ్‌కు తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, డైట్ కళాశాల అధినేత దాడి రత్నాకర్, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని విశాఖలోని ఆంధ్రా మెడికల్ కళాశాలకు అందజేశారు.

గ్రూపు-2 స్టడీ మెటీరియల్ వితరణ


యువతకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: గ్రూపు-2 పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. తారువలోని ఓపెన్ ఆడిటోరియంలో ఆదివారం వీటిని అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ప్రణాళిక బద్ధంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలని వారికి సూచించారు. ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఆయనతోపాటు పెదగోగాడ సర్పంచ్ పైల వెంకటరమణ వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, పంచాయతీ కార్యదర్శి పి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీ కృష్ణ రుక్మిణీ కల్యాణం


శ్రీకృష్ణ రుక్మిణీ కల్యాణంలో పాల్గొన్న యువతీ, యువకులు


ప్రత్యేక అలంకరణలోశ్రీకృష్ణ రుక్మిణీ విగ్రహాలు

అనకాపల్లి : స్థానిక గాంధీనగరం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు రేజేటి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీ కృష్ణ రుక్మిణీ కల్యాణం కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా వివాహం కాని 108 మంది యువతీ, యువకులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం వనభోజన సమావేశం


సాంబశివరావుకు మెమెంటో అందజేస్తున్న సంఘం సభ్యులు


బ్రాహ్మణ కుటుంబ సభ్యులు

అనకాపల్లి : బ్రాహ్మణ కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేయాలని పరశురామ బ్రాహ్మణ సేవా సంఘం జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు నేమనూరి సాంబశివరావు అన్నారు. మండలంలో సత్యనారాయణపురం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ సమీపంలో బ్రాహ్మణ వన సమారాధన- ఆత్మీక కలయిక నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంతో ఏ పనైనా చేయవచ్చని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణులను ఆదుకోవడంలో సంఘం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. జిల్లాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు సంఘం సభ్యులు సాంబశివరావును శాలువాతో సత్కరించారు. అనంతరం వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించి, గెలిపొందిన వారికి బహుమతలు అందజేశారు.

వాసవీ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన సభ్యులు

అనకాపల్లి : స్థానిక వాసవీ క్లబ్ అధ్యక్షునిగా కె.సాయికిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికలో క్లబ్ కార్యదర్శిగా జి.రత్నాజీరావు, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సాయి కిషోర్ మాట్లాడుతూ ఈ కమిటీ ఏడాది పాటు ఉంటుందన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని ఆయన పేర్కొన్నారు.